
ప్రజాశక్తి

శుక్రవారం 31 అక్టోబర్ 2025

5



ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి గురువారం తనిఖీ చేశారు. నెల వారీ తనిఖీలో భాగంగా గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతు కొంప ముంచిన మొంథా

- 1460 ఎకరాల్లో పంట నష్టం
- 33శాతం పంట దెబ్బతిన్నవారే అర్హులంటున్న అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాపై తీవ్రంగా పడింది. గడచిన మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే సమయంలో నీటిపాలు కావడంతో రైతులు కోలుకోలేని రీతిలో దెబ్బ తిన్నారు. ఖరీఫ్ సీజన్ తర్వాత వరుస తుఫాన్ లతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ తుపాను కారణంగా జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు తలమునకలై ఉన్నారు. జిల్లాలో లక్షా 80వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పత్తి 17వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో 1460 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఇందులో 1248 ఎకరాల్లోనూ, పత్తి 187 ఎకరాల్లో నష్టం వాటిలినట్లు అంచనా వేశారు. మరో వారం పదిరోజుల్లో కోతలకు రావాల్సిన వరి చేలు ముడుగులోతు నీటిలో మునిగి పోవడంతో రైతులు నష్టపోతున్నారు. పత్తి పంట కూడా చేతికొచ్చే సమ యంలో వర్షాకు కుళ్లిపోయింది. పత్తి రంగు మారే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పంట నష్టం ఏమేరకు అందుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది.

33 శాతం నష్టం వుంటేనే పరిహారం

రైతు పండించిన వరి గానీ, పత్తి పంట గాని 33 శాతం నష్టం జరిగినట్లయితే పరిహారానికి అర్హులని అధికారులు చెబుతున్నారు. సాగు చేసిన విస్తీర్ణం లో మూడోవంతు పంట దెబ్బ తిన్నప్పుడు మాత్రమే పరిహారానికి అర్హులని నిబంధనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు ఎంతవరకు పరిహారం అందుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిరాశ్రయులకు సహాయక చర్యలు : మంత్రి

సాలూరు : ముంథా తుఫాన్ ప్రభావంతో సురక్షిత ప్రదేశాలకు తరలించిన ప్రజల సంక్షేమ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పునరావాస కేంద్రాల్లో ఉండే వారికి అవసరమైన అన్ని రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తుందని, ఎవరూ దిగులు చెందొద్దని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు నిత్యావసర సరుకులను గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో 79 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయని, పునరావాస కేంద్రాల్లో ఉన్న వీరు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలను చేపట్టిందని పేర్కొన్నారు. ప్రజలు తిరిగి తమ ఇళ్లకు చేరుకునే వరకు ప్రభుత్వం ఎలాంటి లోటు లేకుండా సేవలను కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్, తహశీల్దార్ నీలకంఠరావు, ఎంపిడిఒ జి.పార్వతి పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

మండలంలో జెసి విస్తృత పర్యటన

సాలూరు : మండలంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. మొంథా తుఫాన్‌లో దెబ్బతిన్న పంటలను, పునరావాస కేంద్రాల్లో అందుతున్న సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తొలుత మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి నిర్వాసితులకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని పెద్దపదంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులకు సకాలంలో పరిహారం అందేలా విఎఎ ద్వారా దెబ్బతిన్న పంట వివరాలను ఈ-క్రాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను ప్రారంభించి, పలు సూచనలు చేశారు. అక్కడ నుంచి పాకమామిడివలసకు సందర్శించి బహుళ ప్రయోజన కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం పెద్దపాడు, బాగువలసలోని పిహెచ్‌సిలను సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేసి, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో వ్యవసాయ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



నిరాశ్రయులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

పంట నష్టాలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

సీతానగరం : మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని బూర్జలో నీటిపాలైన వరి పంటను రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. తుఫాన్‌కు ముందే సుమారు 20 ఎకరాలు వరకు కోతలు కోసినట్లు రైతులు తెలిపారు. తుఫాను ప్రభావంతో వరి పనలు చాలావరకు పడిపోయి నీట మునిగాయని, చేతికొచ్చిన పంట నోటికొచ్చేసరికి నేలపాలైందని రైతులు లబోదిబోమంటున్నారు, కానీ వ్యవసాయ అధికారులెవరూ ఇంతవరకు మా గ్రామానికి వచ్చి పంట నష్టాన్ని పరిశీలించి అంచనా వేయలేదని రైతు సంఘ నాయకుల వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి మాట్లాడుతూ సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికైనా మండలంలో గల గ్రామాలను సందర్శించి, పంటలను పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని, మండలమంతా ఇదే పరిస్థితి నెలకొంది అన్నారు. కావున తడిసిన ధాన్యం, తేమ శాతం ఉన్నాయని, నిబంధనల పేరుతో ధాన్యం కొనకుండా ఆటంకపరచొద్దని, రైతు పండించే ప్రతి గింజను ప్రభుత్వం నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేనిచో బాధిత రైతులతో ఆందోళన చేపడతామని తెలిపారు. పరిశీలించిన వారిలో సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, రైతులు గుణుపూరు సింహాచలం, బంకురు శివున్నా యుడు, గుణుపూరు సత్యం నాయుడు, బంకురు నూకం నాయుడు, కొట్టాన రామినాయుడు,కొట్టాన గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని నారాయణపురం, గౌరీపురం, పెద్దింపేట, బలిజిపేట, పలగర గ్రామాల్లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు, నాయకులు గేదెల సత్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు పర్యటించారు. ఈ గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. చేతికొచ్చిన పంట నోటికి వచ్చేసరికి నీటి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే వాణిజ్య పంటలు కూడా పాడైపోయినట్టు కూరాకుల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపురం పలగర, మెట్ట వలస, పెద్దపెంకి, గంగాడ, బర్లి, అరసాడలో కూరగాయలు పండించిన రైతులు తుఫాను కారణంగా నష్టపోయారన్నారు. మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని, కావున రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఆర్టికల్చర్ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిశీలన అనంతరం ర్యాలీగా నారాయణపురం సచివాలయం దగ్గర ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మండల గోవింద, దన్నాన త్రినాథ దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెన్నెల వేణు, కౌలు రైతు సంఘం నాయకులు, భానుమూర్తి, రైతు కూలీ సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

29 ఎకరాల్లో పంట నష్టం

సీతానగరం : తుపానుకు మండలంలో ప్రాథమిక అంచనా ప్రకారం 29 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి ఎ.అవినాష్ తెలిపారు. మండలంలోని కోటసీతారాం పురం, పెదఅంకాలం, గుచ్చిమి, జోగుంపేటల్లో ఎఒతో పాటు విఎఎలు పర్యటించారు. నీటి ఉధృతి ఎక్కువగా లేదని, వరి పంట గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉండడం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎండ ఎక్కువ కాగానే పణలు అరబెట్టాలని, మొలక, రంగు మారకుండా 50గ్రాముల ఉప్పు లెటర్ నీటికి కలిపి పనలపై పిచికారీ చేయాలన్నారు. అలాగే వరి పంట వాలిన చోట నిలబెట్టాలని సూచించారు.

వాడజంగిలో కూలిన రేకిల్లు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని బీరుపాడు పంచాయతీ వాడజంగి లో రేకిళ్ల కూలిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కిల్లక మితిలమ్మ ఇల్లు వర్షానికి తడిసి కుప్పకూలిందన్నారు. ఇల్లు కూలడంతో ఆశ్రయం లేకుండా పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



వాడంగిలో కూలిన గోడ

మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దుడ్డుఖల్లులో సుమారు 50 ఎకరాల్లో వేసిన మొక్కజొన్న పంట ఈదురు గాలులకు నేలకొరిగిందని, వర్షపు నీటికి తడవడంతో పొలంలో పంట ఉండగానే మొక్కజొన్న పొత్తులకు మొలకలు వస్తున్నాయని రైతులు పువ్వల తిరుపతిరావు నిమ్మక గౌరీ శంకర్, బిడ్డిక నారాయణ, మోహన్‌రావు, రామకృష్ణ, తిరుపతి, వైకుంఠ తదితర ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పత్తి పంట కూడా వర్షానికి తడిసి ముద్దయిందన్నారు.

అమరుల త్యాగాల స్ఫూర్తితో నిష్పక్షపాత సేవలు అందిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పోలీసు అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజలకు నిష్పక్షపాత సేవలు అందిస్తామని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ అమరుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ వారికి సంఘీభావం తెలుపుతూ, ఎస్‌పితో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్ నుంచి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్ వద్ద మనవహారంగా ఏర్పడి, జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అమరుల చిత్రపటాలు కలిగిన బ్యానర్ వద్ద, జిల్లా ఎస్పీ , పోలీస్ సిబ్బంది, విద్యార్దులు కొవ్వొత్తులను వెలిగించి, మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ దీపం తనని తానూ కాల్చుకుంటూ ఆరిపోతూ కూడా వెలుగునిస్తుందని. అదేవిధంగానే పోలీస్ అమరవీరుల త్యాగాలు కూడా. ప్రాణం పోతున్నా సమాజంలో వెలుగు నింపి అమరులయ్యారని, దీపపు కాంతి వలే అమరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు కావాల్సిన సేవలన్నీ నిష్పాక్షపాతంగా వారికి అందిస్తామని అన్నారు. 24×7 ప్రజా సేవ కోసం ముందుండి రక్షణ కల్పించేది ఒక్క పోలీస్ శాఖ మాత్రమేనని అన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు తమ వ్యక్తిగత జీవితాన్ని నిరంతరం త్యాగం చేస్తూ ప్రజా సేవలో ముందండిన క్రమంలో ఎంతోమంది పోలీసులు అమరులైనారని అన్నారు. ఈ విధంగా అమరులైన పోలీసులను, వారి సేవలను త్యాగాలను స్మరించుకుంటూ ఘనమైన నివాళులు అర్పించడం మన నైతిక బాధ్యత అని జిల్లా ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎస్‌బి సిఐ రమణమూర్తి, పార్వతీపురం పట్టణ సిఐ మురళీధర్, రూరల్ సిఐ రంగునాథం, ఎఆర్ ఆర్ఐ లు రాంబాబు, నాయుడు, శ్రీనివాసరావు, ఎఆర్ ఆర్ఎస్ఐ లు, ఎస్సైలు, సిబ్బంది, పాఠశాల/కళాశాలల విద్యార్దులు పాల్గొన్నారు.

కురుపాం :పోలీసు అమరవీరుల వారోత్సవాల భాగంగా ఎల్విన్‌పేట, చినమేరంగి సిఐలు హరి, తిరుపతిరావు ఆధ్వర్యంలో స్థానిక రావాడ రోడ్డు జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు వరకు పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకొని అమరవీరుల అమర్ రహే అంటూ నినాదాలతో విద్యార్థులతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలో గల ఎస్ఐలు పి.నారాయణరావు, బి.శివప్రసాద్, ఎ.నీలకంఠరావు, ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, పోలీసు అధికారులు

ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు

పార్వతీపురం టౌన్ : పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డిసిఆర్‌బి సిఐ పర్యవేక్షణలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. "లైంగిక నేరాల నుండి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర" అన్న అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో మంచి ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు.

ఆశ్రమ పాఠశాలలకు దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని బెలగాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి గురువారం దోమతెరలను పంపిణీ చేశారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్తుల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా దోమతెరలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మలేరియా నివారణ చర్యల్లో భాగంగా వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో దోమ తెరలను అందించడానికి రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో ప్రస్తుతానికి 1700 దోమ తెరలను జిల్లాకు రప్పించామన్నారు. త్వరలో మరిన్ని దోమతెరలు జిల్లాకు రానున్నాయని, వీటిని జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా బెలగాం ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు దోమతెరలను పంపిణీ చేసుకుంటున్నట్లు చెప్పారు. వీటిని వినియోగించడం ద్వారా దోమలు నుంచి సంక్రమించే మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ పి.శ్రీరాములు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎ.విజయ శాంతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి


జిల్లాకు రానున్న మరో 1,641 దోమ తెరలు

రెడ్ క్రాస్ సంస్థ ద్వారా జిల్లాకు మరో 1,641 దోమతెరలు రానున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఏ.విజయశాంతి తెలిపారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లోని వసతి గహాలు, ఆశ్రమ పాఠశాలలకు వీటిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇదివరకు 1700 దోమతెరలను రెడ్ క్రాస్ సంస్థ వితరణ చేయగా, వీటిని అత్యవసరమైన ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వీటిలో సాలూరు, కురుపాం, జి ఎల్ పురం ఆశ్రమ పాఠశాలలకు 1,400 దోమ తెరలు, సీతంపేటలో 241 దోమతెరలను చేస్తామని ఆమె పేర్కొన్నారు.

1న వనంతో ఉత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో పర్యాటకులకు సరికొత్త అనుభూతి ఇచ్చేలా, మన్యం అందాలను పర్యాటకులు ఆస్వాదించేలా వనంతో ఉత్సవం (పార్వతీపురంలో టూరిజం సీజన్ స్టార్ట్స్)లి పేరుతో నవంబర్ 1న స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో టూరిజం ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా హాట్ ఎయిర్ బెలూన్‌ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఆదేరోజు మెట్టుగూడ జలపాతం వద్ద వెదురుతో చేసిన ఫోటో పాయింట్ వద్ద ప్రత్యేక ఫోటో సెషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడే మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీతంపేట టూరిజంలో భాగంగా ఏజెన్సీ మన్యం అందాలు పర్యాటకులకు తెలియజేసేలా మెట్టుగూడ జలపాతం నుండి సీతంపేటలోని టిటిడి దేవాలయం వరకు బైక్ ర్యాలీని నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం హాట్ ఎయిర్ బెలూన్‌ను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఈవెంట్‌లో భాగంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదే రోజున జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని ఉంటుందని, అందులో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రి జంక్షన్ నుంచి ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వరకు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గిరిజన నృత్యాలతో విద్యార్థులతో కలిసి కార్నివాల్ (ర్యాలీ) కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పిఒ తెలిపారు.



విద్యుత్‌శాఖ ఎఇ సస్పెండ్

ప్రజాశక్తి - బలిజిపేట

మండల విద్యుత్‌శాఖ ఎఇని కలెక్టర్ ప్రభాకరరెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తుఫాను నేపథ్యంలో వంతరాం గ్రామంలోకి వేగావతి నీరు చేరింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవ్వడంతో కలెక్టర్, సబ్ కలెక్టర్ వైశాలి వంతరాంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో గల కెజిబివిని సందర్శించగా గత రెండు రోజులుగా తమ పాఠశాలకు విద్యుత సరఫరాలేదని కలెక్టర్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించగా, గంట వ్యవధిలోనే విద్యుత్ సరఫరా కల్పించారు. దీంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన విద్యుత్ ఎఇని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.



భూమి కోసం, భుక్తి కోసం ఈ ప్రాంతంలో ప్రతి దిక్కూ నినదిస్తోంది. ఆ నినాదాలకు పేరు పెడితే.. ఆ నాటి త్యాగాలను స్మరిస్తే.. అప్పుడు జాలువారిన కన్నీటిని, చిందించిన నెత్తుటిని గుర్తిస్తే.. మొత్తంగా ఆ అలజడికి అక్షర రూపం ఇస్తే.. అదే గిరిజన రైతాంగ పోరాటం సిక్కోలులో 1960వ దశకంలో దిక్కులు పిక్కటిల్లేలా నేటికి సరిగ్గా 58 ఏళ్ల క్రితం ఇదే రోజున శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. ఆ ఉద్యమం విస్తతమైంది.. క్రమంగా గిరిజనులకు పలు హక్కులు సంక్రమించాయి. శుక్రవారం కోరన్న, మంగన్న 58 వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం

స్ఫూర్తిదాయకం... గిరిజన రైతాంగ పోరాటం

- అమరవీరుల త్యాగఫలమే నేటి గిరిజనాభివృద్ధి
- నేడు కోరన్న, మంగన్న 58వ వర్ధంతి
- మామిడిమానుగూడలో సభ

ప్రజాశక్తి- కురుపాం, గుమ్మలక్ష్మీపురం

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం దున్నేవాడిదే భూమి అనే నినాదంతో భూస్వాములకు వ్యతిరేకంగా 1967 అక్టోబర్ 31న కమ్యూనిస్టు పార్టీ మొండెంఖల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఈ సభకు విద్యార్థులు, మహిళలు, గిరిజనులు పిల్లాపాపలతో సభకు వెళున్నారు. ఈ బహిరంగ సభను భగ్నం చేయాలని పలువురు భూస్వాములు పి.లేవిడి వద్ద ఆదివాసీలపై దాడులు చేశారు. ఆనాటి భూస్వాముల కాల్పుల్లో ఇద్దరు ఆదివాసీ యువకులు మరణించారు. వారే శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తొలి అమరవీరులు ఆరిక కోరన్న, కొండగొర్రె మంగన్న .

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కొంత ప్రాంతం ఆనాటి శ్రీకాకుళం జిల్లాలో ఉండేది. ఇందులో అధిక శాతం భూమి జమీందారులు, సంస్థానాధీశుల ఆధీనంలో ఉండేది. ఆదివాసీలకు అక్షర జ్ఞానం లేక అంకెలు తెలియకపోవడంతో భూస్వాముల దోపిడీకి వరంగా మారింది. భూస్వాముల వెట్టిచాకిరీ నుంచి గిరిజనులకు విముక్తి కల్పించడానికి పలు పోరాటాలు జరిగాయి. గిరిజనులను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏర్పాటు చేసి ఉద్యమాలకు ఊపిరి పోశారు. పల్లెరక రాములు, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం తదితరులు ముందుండి ఉద్యమాలను నడిపించారు. 1971 వరకు వివిధ దశల్లో ఉద్యమాలు జరిగాయి. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోలీసు తూటాలకు బలైపోయారు. ఆరిక గుంపస్వామి, కొండగొర్రె లచ్చన్న, కృష్ణమూర్తి, శ్రీరాములు, వసంత, రఘు, రాములు తదితరులు జైలుపాలయ్యారు. ఆనాటి ఉద్యమకారుల త్యాగ ఫలంగానే ఐటిడిఎ, జిసిసి ఏర్పాటయ్యాయి. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం వచ్చింది.

హక్కులను కాలరాసేందుకు కుట్ర

పోరాట ఫలితంగా గిరిజనులు సాధించుకున్న హక్కులను నేటి పాలకులు కాల రాయడానికి కుట్రలు చేస్తూనే ఉన్నారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి అడవి తల్లి ఒడిలో బతుకుతున్న గిరిజనులను అక్కడి నుంచి వెళ్ల గొట్టేందుకు కుట్రలు పన్నింది. ఏజెన్సీలో ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అందులో భాగంగానే గిరిజన, రైతులకు జీవనాధారమైన బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు పాలకులు అనుమతులిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ 3ను రద్దు చేశారు. ఇలా ఎన్నో నిర్ణయాలను ఆదివాసీలకు వ్యతిరేకంగా చేశారు. వీటిపై సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పోరాటాలు చేసి ఆ ప్రయత్నాలను కొంతమేర అడ్డుకున్నారు. యుపిఎ హయాంలో వామపక్షాల చొరవతో వచ్చిన ఆటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు. చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని నీరుగార్చే చర్యలకు ఒడిగట్టింది.. అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులకు భూములపై హక్కులు లేకుండా చేయాలని చూస్తోంది..

నేడు మామిడిమానుగూడలో కోరన్న మంగన్న వర్ధంతి సభ :

నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడలో శుక్రవారం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట అమర వీరుల కోరన్న మంగన్న 58వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభ కు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొంటారని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

ఫ్రైడే డ్రైడే పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారుల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తుఫాను తీవ్రత వల్ల ఏ గ్రామంలో అయినా కాలువలు పాడైనట్లయితే వాటిని గుర్తించి వివరాలను నమోదు చేసి జాబితాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎఒ డి.వెంకటరమణ, డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, సచివాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పార్కు వద్ద వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక అడ్వెంచర్‌పార్కు వద్ద సీతంపేట పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఏఎస్ఐ సంజీవ్ మాట్లాడుతూ యువత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అనంతరం సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపుడివలసలో గురువారం స్థానిక ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమానమైన ఫోన్ కాల్స్ వచ్చినట్లయితే స్వీకరించొద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే వివిధ రకాలైన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య లోపం లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీలో ఎక్కడా కూడా పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని జి.శివడ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి ఎం.ధనంజయరావు ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం తుపాన్ నేపథ్యంలో పంచాయతీ పరిధిలోగల అన్ని గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు కోరినేషన్ చేయించి ప్రజలందరికీ వేడి నీరు తాగాలని సూచించాలన్నారు. వ్యాధులు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జి.రమేష్ బాబు, విఆర్ఒ సుశీల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియుజివిని అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి -విజయనగరంటౌన్

జెఎన్‌టియు జివిని అభివృద్ధి చేయాలని విసి విజి సుబ్బారావును ఉత్తరాంధ్ర విద్యా సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. గురువారం ఆయన విసిని కలిశారు. గతంలో విశ్వవిద్యాలయంలో జరిగిన అనేక అవినీతి అక్రమాలను వివరించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ఏకైక సాంకేతిక విశ్వవిద్యాలయం ఇదొక్కటేనని, దీనిని అభివృద్ధి పరచాల్సింది పోయి స్వార్థపూరిత ఆలోచనలతో గత పాలకులు తీసుకున్న అవినీతి నిర్ణయాలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట దిగజారిందని తెలిపారు. విసి సుబ్బారావు స్పందిస్తూ, విశ్వవిద్యాలయ ప్రతిష్ట ను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, డాక్టర్ అల్లాడి వీరభద్రరావు, డాక్టర్ దంతేశ్వర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

ప్రపంచ పొదుపు దినోత్సవం సందర్భంగా గురజాడ పబ్లిక్ స్కూల్లో పొదుపు అనే అంశంపై విద్యార్థులకు మదర్ తెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సేవా సంఘం అధ్యక్షులు- త్యాడ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ, పొదుపు అనేది ముఖ్యంగా విద్యార్థులు, యువతకు చాలా అవసరమని అన్నారు. విద్యార్థులకు నీరు, విద్యుత్తు, ఆహారం, కాలం, ధనం వంటి వాటి మీద అవగాహన కల్పించారు. గురజాడ స్కూల్ హెచ్‌ఎం పుడి శేఖర్, సైన్స్ హెచ్‌ఒడి పి.రమేష్, స్కూల్ ఇన్చార్జ్ బి.పద్మలత, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఢిల్లీ సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు విద్యార్థి

ప్రజాశక్తి - భామిని

ఢిల్లీ సైన్స్ ఎక్స్‌ఫోజర్ అండ్ టూర్‌కు స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని షావుకారి నిహారిక ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ బాబురావు తెలిపారు. నవంబర్ 6 నుంచి 8 వరకు ఢిల్లీలో జరిగే ఈ టూర్‌లో నిహారిక పాల్గొంటుందన్నారు. ఈ సైన్స్ టూర్‌లో నాసా శాస్త్రవేత్తలతో ముఖాముఖి, వర్క్ షాప్ లో పాల్గొంటారన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు, విద్యార్థి బృందంతో కలిసి ఢిల్లీలోని రెఫ్యూ టెడ్ సైన్స్ ఇన్స్టిట్యూట్, ఢిల్లీ సైన్స్ మ్యూజియం, ఢిల్లీలోని సైన్స్ ప్లాంటోరియం సందర్శించి పరిశీలిస్తారని తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయిలో ప్రతిభా విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సెన్సీ బాలుర ప్రతిభా పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్ -19 కేటగిరీలో సత్తా చాటారు. వాలీబాల్‌లో కిల్లు భానుప్రసాద్, ఆర్చరీలో జైప్రసాద్ ఎంపికయ్యారు. అలాగే ఎస్‌జిఎఫ్‌లో 94కేజీల కేటగిరి వైట్‌లిఫ్టింగ్‌లో రాజ్యన్ సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో గెలిచినందుకు ప్రిన్సిపల్ బి.ధర్మరాజు, పిఇటి ఎం.ఉదయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

తుఫాన్ కారణంగా ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం నీటి పాలై తీవ్రంగా నష్టపోయిన కౌలు రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు డిమాండ్ చేశారు. మండలంలోని జనార్ధనవలసలో గురువారం ఆయన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ కౌలు రైతులతో అంతా కలిసి గ్రామంలో పంట నష్టాన్ని పరిశీలించారు. సుమారుగా వంద ఎకరాల్లో పంట నీటిపాలై తీవ్ర నష్టం జరిగిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి మాజీ ఎమ్మెల్యే తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇందుకు జోగారావు స్పందిస్తూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారుల దృష్టిలో కౌలు రైతుల సమస్యను తీసుకెళ్తానన్నారు. ఆరుగాలం కష్టపడి పండించి చేతికింది వచ్చిన వరి పంట నీట మునిగి కోతకు సిద్ధమైన వరి చేను నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోతున్నారని కావున బాధ్యత గల ప్రభుత్వం తక్షణం సంబంధిత అధికారులను పంపించి పంట నష్టం అంచనాలు వేయించి సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

తుఫాను ప్రభావంపై జిల్లా, మండల స్థాయి అధికారులతో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం సమీక్షించారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గ్రామస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అత్యవసర వనరులు, రక్షణ బృందాలు, వైద్య సేవలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే తుఫాను ముందు, తర్వాత అన్ని పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలపై ఎటువంటి ప్రభావం పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. అనంతరం పెద్దగెడ్డ జలాశయాన్ని సందర్శించి నీటిమట్టం గేట్లు నియంత్రణపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, మండల టిడిపి అధ్యక్షులు గూడేపు యుగంధర్, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, నాయకులు మతల బలరాం, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, చల్లా కనక, పల్లేడ ఉమామహేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల బృందం పంట నష్టాల పరిశీలన

తుఫానుకు జరిగిన నష్టాలను కృషి విజ్ఞాన కేంద్రం రక్తకుంటుబాయి శాస్త్రవేత్తల బృందం మండలంలోని మోసూరు, తాడూరు పర్యటించింది. ఈ బృందంలో సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అమృత వీణ, పశుసంవర్ధక శాఖ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అను హెూమ్ సైన్స్ శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి ఉన్నారు. ఎఎంసి చైర్మన్ సూర్యనారాయణతో కలిసి తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. గింజ మొలకెత్తకుండా రంగు మారకుండా ఉండాలంటే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పత్తి పంటకు నీరు తీసివేసి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుని ప్రాఫికొనజోల్ ఒక మిల్లీ లీటరు ఇమిడా క్లోప్రేడ్ 0.4 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలని



గుమ్మలక్ష్మీపురం: పత్తి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



పాచిపెంట: ఒట్టిగెడ్డను పరిశీలిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

తెలిపారు. వరి పంటకు అవసరాన్ని బట్టి సస్యరక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ గోపాలకృష్ణ, ప్రకృతి సిద్ధ సిఆర్పి సురేష్ పాల్గొన్నారు

అన్నదాతకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో జియ్యమ్మవలస మండలం డంగభద్ర పరిసర ప్రాంతాల్లో నష్టం వాటిల్లిన పంటల పరిస్థితిని గురువారం ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా నేలకొరిగిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టం జరిగిన రైతులు ఇబ్బంది పడకుండా తక్షణ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కావున వ్యవసాయ అధికారులు వెంటనే నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. అనంతరం గడసింగుపురానికి సమీపాన గల ఉమ్మగెడ్డను పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. డంగభద్రలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ పర్యటనలో ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, మండల కన్వీనర్ జోగి భుజంగరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిడిఒ, తహశీల్దార్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిత్యవసర వస్తువులు పంపిణీ

మండలంలోని గొయిపాక పంచాయతీ టంకు గ్రామంలో తుపాను వల్ల దెబ్బతిన ఇల్లును గురువారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. పునరావాసం కల్పించిన గ్రామానికి చెందిన బాధితులకు నిత్యవసర సరుకులు అందజేశారు. పుసాబడి గ్రామంలో వర్షాలకు గోడకూలిన ఇంటిని పరిశీలించారు. వారికి ఆశ్రయం ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ కద్రక కళావతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, బిజెపి ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ శేఖర్, ఎంఇఒ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని మొండెంఖల్ పంచాయితీలో గల గోర్జిపాడులో కూలీలన ఇల్లును ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి గురువారం పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె. జయ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

వీరఘట్టం: మండలంలోని చినగోర మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గురువారం వీరఘట్టం గ్రామానికి చెందిన డాక్టర్ భోగి సంపత్ కుమార్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు వేడిచేసిన నీరు తాగాలని, అందుకు ఈ బాటిళ్లు ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయులు కెటివి పోలినాయుడు అన్నారు. కార్యక్రమంలో డి.బాలరాజు, కె.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

పాలకొండ : మండలంలోని బాసురులో తుఫాన్ కారణంగా ఆరు కుటుంబాలు ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ గ్రామంలో ఉన్న పాఠశాలలో వారు తలదాచుకున్నారు. వీరికి గురువారం సబ్ కలెక్టర్ స్వప్నల్ పవర్ జగన్నాథ్ 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. ప్రస్తుత వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన తో పాటు తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎంపిపి బొమ్మల భాను, సర్పంచ్ గురువునాయుడు తదితరులున్నారు.




పాలకొండ: నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

◆సమాధానం చెప్పలేక తెల్లమొహం వేసిన కమిషనర్ ◆అక్రమ కట్టడాలపై ఎందుకు పట్టించుకోవటం లేదు?

ప్రజాశక్తి- పాలకొండ

పలు సమస్యలపై కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలకు కమిషనర్ సమాధానం చెప్పలేక తెల్లమొహం వేసిన సంఘటన గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో చోటు చేసుకుంది. నగర పంచాయతీ చైర్పర్సన్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఏకమై సమస్యలపై గళమెత్తారు. అలాగే నగర పంచాయతీలో జరుగుతున్న అవకతవకలు, కౌన్సిలర్లకు చెప్పకుండా పనులు చేయడం పట్ల కూడా సభ్యులంతా కమిషనర్ రత్నరాజును నిలదీశారు. దీంతో కమిషనర్ తెల్ల ముఖం వేసి సిబ్బందిపై నెట్టేవేసే పరిస్థితి ఎదురైంది. కౌన్సిలర్ పల్లా భాను తన వార్డులో గల నాగ వంశపు వీధి ప్రాంతంలో చెరువులో ఒక వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. తప్పుడు పత్రాలతో నిర్మాణం చేస్తున్నప్పటికీ నిలిపి వేయకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే తెలకల వాణి చెరువు వద్ద రూ.36లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పెట్టగా దీనికి కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, గంట సంతోష్ కుమార్, దుప్పాడ పాపి నాయుడు, కె.మోహన్



సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిలర్లు

అభ్యంతరం వ్యకతం చేశారు. అక్కడ డంపింగ్ యార్డ్ లేదని, అలాంటప్పుడు ప్రహరీ గోడకు నిధులు కేటాయించడమేమిటని నిలదీశారు. అద్దెకు ట్రాక్టర్లు తీసుకోవడానికి రూ.7,30,000 మంజూరుకు ఎజెండాలో ప్రతిపాదించగా దాన్ని కూడా కౌన్సిర్లుగా అడ్డుకున్నారు. కొత్త టాక్టర్ రూ.6లక్షలకు వస్తే అద్దెకు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. అలాగే ఎన్‌కె రాజపురం, వడమ కోమటిపేట ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దీనిపై ఎందుకు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు నీలాపు శ్రీను, తూముల లక్ష్మణరావు, కె. విజయకుమార్ కమిషనర్‌ను నిలదీశారు. అలాగే ఔట్సోర్సింగ్ పేరుతో ఇటీవలే ఎంతమంది ఉద్యోగాలు వేశారని కమిషనర్‌ను కౌన్సిలర్లు విజయకుమార్, మోహన్ కమిషనర్‌ను ప్రశ్నించగా ఒక్కరికే నియమించమని చెప్పగా బద్రి అనే వ్యక్తి శానిటేషన్ సూపర్వైజర్‌నని చెప్పి నగర పంచాయతీలో పలువురు దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారని సమావేశంలో ప్రస్తావించారు. ఉత్తర్వులు ఏమీ రాలేదని, అయితే విధులు మాత్రం నిర్వహిస్తున్నారని కమిషనర్ చెప్పడంతో ఒకసారిగా సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. నియామక ఉత్తర్వులు రాకుండా విధుల్లో ఎలా తీసుకుంటారని కమిషనర్ ను నిలదీశారు. పదో వార్డులో వెంకట్రాం కోనేరు దగ్గర పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు ప్లాట్‌ఫారం నియమించడానికి రూ.62వేలు డ్రా చేసేందుకు ఎజెండాలో పెట్టగా, దానిపై కూడా కౌన్సిలర్లు అడ్డుకున్నారు. దాతల విరాళాలతో అక్కడ పనులు జరిగాయని తీర్మానంలో పెట్టడమేమిటని కౌన్సిలర్లు విరుచుకుపడ్డారు. సమావేశంలో పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జిల్లా విభజనలో పాలకొండకు న్యాయం చేయాలి

జిల్లాల విభజనలో పాలకొండకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి బృందం గురువారం చైర్మన్ ఆకుల మల్లేశ్వరి కమిషనర్ రత్నరాజు, కౌన్సిలర్ కలిసి కోరారు. దీనిపైకూడా తీర్మానం చేశారు

లెండిలో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం మూడు రోజులు పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా అనలిటిక్స్ వంటిపై సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో భాగంగా విభిన్నంగా ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్పో ఆకట్టుకుంది. ఈ కాన్ఫరెన్స్ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులకు తమ అభిప్రాయాలు పంచుకునేందుకు, తెలివైన కంప్యూటింగ్ వ్యవస్థల భవిష్యత్తును ఆకారమిచ్చే క్రియాత్మక అభిప్రాయాలు పరిశీలించేందుకు ఉత్తమ వేదికగా నిలిచింది. గురువారం తొలిరోజు ప్రాజెక్ట్ ఎక్స్పోలో వివిధ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు రూపొందించిన అత్యాధునిక నమూనాలు, పరిశోధనల ప్రదర్శనగా నిలిచాయి. ఎఐ హెడ్ అండ్ జనరేటివ్, నాస్కాం బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ కార్తికేయన్ సమీనాథన్ మాట్లాడుతూ వినూత్న డిజిటల్ సాంకేతికతలు పరిశ్రమలను, విద్యారంగాన్ని ఆధునికంగా ఎలా మలుస్తున్నాయో వివరించారు. ప్రిన్సిపాల్ వివి.రామారెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ వి.అంజిరెడ్డి, హరిబాబు తమ్మినేని అద్యాపకులు, పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - కురుపాం

గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నిర్మూలనకు అటవీ, ఎక్సైజ్, పోలీస్ శాఖ సిబ్బంది కలిసికట్టుగా పనిచేయాలని చినమేరంగి, ఎల్విన్ పేట సిఐలు తిరుపతిరావు, హరి అన్నారు. గురువారం కురుపాం పోలీస్ స్టేషన్ వద్ద ఎల్విన్ పేట, చినమేరంగి సర్కిల్ పరిధిలో గల మూడు శాఖలతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక శాఖ దగ్గర ఉన్న సమాచారం మరో శాఖకు పంచుకొని మూడు శాఖల సంయుక్తంగా కలిసి పనిచేస్తే గంజాయి, నాటుసార అక్రమ నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి గంగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సర్కిల్ పరిధిలో గల ఎస్ఐలు పి.నారాయణరావు, శివప్రసాద్, నీలకంఠ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

ఇంకా నీటిలోనే పంటలు

ప్రజాశక్తి - కొమరాడ

తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని పూడేష్ పంచాయతీ గుమడంగి, అర్తాం, విక్రాంపురం, సోమినాయుడు వలస తదితర గ్రామాల్లో వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. అలాగే కుంతేసు పంచాయతీ మహామందుల భానుమతి ఇంటి గోడ కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ నానిపోవడంతో కూలియింది. గోడ పడిపోయిన సమయంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

సీతానగరం ఆయకట్టు పరిశీలన

సీతానగరం: మండలంలోని కొత్తవలస వద్ద ఉన్న సువర్ణముఖి నదిపై ఉన్న సీతానగరం ఆయకట్టు ప్రాజెక్టు నీటిని ఆయకట్టు చైర్మన్ తెంటు వెంకట అప్పలనాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీవ్రతను బట్టి ఆయకట్టులో పరిసర ప్రాంతాలను దిగువునున్న పంట భూములను పరిశీలించి రైతులకు ముందస్తు సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ భాస్కర్ రావు, జెఇ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

వీరఘట్టం: తుపాను వల్ల మండలంలోని ఎక్కడ ఎటువంటి ప్రాణహాని, ఆస్తి నష్టం వాటిల్లకపోవడంతో మండల స్థాయి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొట్టుగుమ్మడ, నడుకూరు, తలవరం, పనస నందివాడ, గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది తప్ప ఎక్కడా పూర్తిస్థాయిలో పంట నష్టం వాటిల్లకపోవడంతో అన్నదాతలు కూడా ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రంతో పాటు బూరుగా, సిఎస్‌ఆర్ పేట, కొట్టు గుమ్మడ తదితర గ్రామాల్లో క్యాబేజీ పంట నష్టం వాటిల్లడంతో పంట నష్టనాలు అంచనాలు వేసేందుకు ఉద్యానవన శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఏది ఏమైనా తుఫాను తీవ్రత మండలంపై పెద్దగా లేకపోవడంతో అటు అధికార యంత్రాంగం ఇటు ప్రజలకు ఊపిరి పీల్చుకున్నారు.



వీరఘట్టం: నీటిలో ఉన్న వరి చేను

గుంతలను వెంటనే పూడ్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులను వెంటనే బాగు చేయించాలని ముఖ్యంగా రోడ్డుకు పడ్డ గుంతలను కప్పి ప్రమాదాలను నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అర్థం గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తితో కలిసి ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు పడటంతో ఈ రహదారి మార్గంలో గొయ్యిలన్నీ నీటితో నిండిపోయాయని, అనేకమంది వాహనదారులు ఈ గొయ్యిలో పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని అన్నారు. నవంబర్ 10 లోపు ఈ మరమ్మతు పనులు చేపట్టకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు రామారావు, ఆటో యూనియన్ నాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు గుంతలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్ల మరమ్మతులు తక్షణం చేపట్టాలి : సిపిఐ

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాలో రోడ్ల దుస్థితిపై అధ్వాన్నంగా ఉందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాకాలం కారణంగా స్థానిక బైపాస్ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, రోజూ వందలాది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రహదారులు అత్యంత ప్రమాదకరంగా మారాయని, గత మూడు నెలలుగా అధికారులు ప్రజల విన్నపాలను పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. రోడ్ల మరమ్మతు పనులు మొదలుపెట్టినా సగం వదిలేసి కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఇవి నాయుడు, ఆర్‌విఎస్ కుమార్, గోపి నాయుడు, సమితి నాయకులు మర్రి సీతారాం, సింహాద్రి కుమార్, ప్రసాదు, రాజు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ నాయకులు వికాస్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ రైడ్ చేస్తున్న యువత

రోడ్లపై బైక్‌లతో ట్రిపుల్ రైడింగ్

ప్రజాశక్తి - భామిని

పోలీసు వ్యవస్థ డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని అవగాహన కలిగిస్తున్నా, ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని చెప్తున్నా క్షేత్ర స్థాయిలో రోడ్లపై ట్రిపుల్ రైడింగ్ ఆగడం లేదు. ప్రధానంగా విద్యార్థులు స్కూల్‌కి వెళ్లే సమయంలో, స్కూలు విడిచి పెట్టే సమయంలో ఆకతాయిల రోడ్లపై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్నారని భామిని బస్టాప్‌లో పలువురు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని తమ పిల్లలకు బైక్‌ని ఇచ్చేటప్పుడే పిల్లల తల్లితండ్రులు ఆలోచించాలని, ప్రమాదం జరిగాక ఆలోచిస్తే బాధపడడం తప్ప ఒరిగేదేమీ లేదని, ఒక వ్యక్తి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల, మరో వ్యక్తి కుటుంబం రోడ్డున పడిపోతుందని, ఈ అంశాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని ఇటీవల బత్తిలి పోలీసులు అవగాహన కార్యక్రమంలో తల్లితండ్రులకు చెప్పారు. అయినా యువత, తల్లిదండ్రుల్లో మార్పు రాలేదు.

మన్యంలో దొంగలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను గిరిజనులు పట్టుకున్న సంఘటన గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం వేకువ జామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని లోవముత్తా ప్రాంతమైన గద్దరజోలలో ఇళ్ల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను గ్రామస్తులు మాటువేసి పట్టుకొని పారిపోకుండా సిమెంట్ స్తంభానికి కట్టారు. గత కొన్నేళ్లుగా గిరిజన గ్రామాల్లో తిరుగుతూ రాత్రి వేళ ఇళ్లల్లో చొరబడి మేకలు, సెల్ ఫోన్లు, ఇంట్లో వస్తువులు ఎత్తుకుపోతూ గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని తెలిపారు. దొంగతనాలను అరికట్టేందుకు, చోరీకి గురవుతున్న జంతువులు, వస్తువులను కాపాడుకునేందుకు అచ్చుబ, చినగీశాడ గ్రామస్తులతో కలిసి కాపు కాసి పట్టుకున్నామని తెలిపారు. చాకచక్య గా ఇద్దరు దొంగలను గద్దర జోల గ్రామస్తులు పట్టుకోవడంతో పలువురు శభాష్ అంటున్నారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీసులకు సమాచారం అందించమన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వీరఘట్టం : మండలంలోని కడకెల్ల ఫీడర్ పరిధిలోని ఈనెల 31న విద్యుత్తు సరఫరా నిలిపివేయినట్లు స్థానిక ట్రాన్స్‌కో ఎఇ కె.సోమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ తదితర చేపట్టడంతో కడకల్లా పీడర్ పరిధిలోని నడుకూరు, కిమ్మి, కంబర, కంబరవలస, చిట్టిపూడి వలస, నడిమికెల్ల గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.